కాంగ్రెస్‌ పార్టీలోకి భారీగా చేరికలు

నిజాంపేట్‌: కాంగ్రెస్‌ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై కాంగ్రెస్‌ పార్టీలోకి భారీగా చేరికలు కొనసాగుతున్నాయని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్‌ హన్మంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం 125 డివిజన్‌ తమిళ్‌ బస్తీకి చెందిన సుమారు 100 మంది వివిధ పార్టీల నాయకులు, పార్టీ కార్యకర్తలు డి. శ్యామ్‌ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. కార్యక్రమంలో కాశీమణి, రాజేందర్‌, కృష్ణ, శాంతి, సెల్వి, సుగుణ, నాగేంద్ర, రోజా, మేరీ, గోవింద స్వామి, రవి, నాగలక్ష్మి, నాగమణి పాల్గొన్నారు.

ఎల్లమ్మ ఆలయంలో అభిషేకం



రంగారెడ్డినగర్‌: జీడిమెట్ల డివిజన్‌ వైష్ణవి ఎన్‌క్లేవ్‌ శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయంలో మంగళవారం అభిషేకం నిర్వహించారు. అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి పూజలు చేశారు. ఈనెల 21 పూజలతో ప్రారంభమై 22న రేణుక ఎల్లమ్మ కల్యాణ మహోత్సవం నిర్వహించేందుకు ఆలయ కమిటీ తీర్మానం చేశారు. ఈ రెండు రోజులపాటు జరిగే ఏర్పాట్లపై కమిటీని ఎంపిక చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు వెంకటేష్‌ గౌడ్‌, చంద్రశేఖర్‌, రాకేష్‌ కుమార్‌, భాగ్యలత, అనురాధ, రాధిక, గాయత్రి, కవిత తదితరులు పాల్గొన్నారు.

‘ప్రజావాణి’ ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు



ఎస్సార్‌ నాయక్‌ నగర్‌లో సమస్యలు తెలుసుకుంటున్న ఉప కమిషనర్‌ నరసింహ

కుత్బుల్లాపూర్‌: ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించే దిశగా చర్యలు చేపడుతున్నామని ఉప కమిషనర్‌ నరసింహ అన్నారు. సోమవారం సుభాష్‌ నగర్‌ డివిజన్‌ పరిధిలోని ఎస్సార్‌ నాయక్‌ నగర్‌లో పారిశుద్ధ్య సమస్య, ఎంటమాలజీ విభాగంపై ఫిర్యాదు చేయగా మంగళవారం ఉదయం ఉప కమిషనర్‌ సిబ్బందితో కలిసి ఆ ప్రాంతంలో పర్యటించారు. స్థానికంగా ఉన్న పరిస్థితులను ప్రజలను అడిగి తెలుసుకుని సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. రోడ్లపై చెత్త తొలగించడం లేదని పలువురు ఫిర్యాదు చేయగా.. కార్మికులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శానిటరీ ఫీల్డ్‌ అసిస్టెంట్‌ దగ్గరుండి పనులు చేయించాల్సి ఉండగా.. ఎక్కడ తిరుగుతున్నావు? అంటూ మండిపడ్డారు. సాయంత్రం వేళల్లో ఫాగింగ్‌ చేసేలా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంక్షేమ సంఘం ప్రతినిధులు గుబ్బల లక్ష్మీనారాయణ, వెంకట శేషాచారి, భాస్కర్‌ రెడ్డి, హరిబాబు యాదవ్‌, పూర్ణచందర్‌ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

ఎల్లయ్యకు ఘన నివాళి

సుభాష్‌నగర్‌: వడ్డెర కులస్తుల సంక్షేమం కోసం ఎల్లయ్య చేసిన సేవలు ఎనలేనివి అని గాజులరామారం కార్పొరేటర్‌ రావుల శేషగిరి అన్నారు. బాలయ్యనగర్‌ వ్యవస్థాపకుడు, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా వడ్డెర సంఘం అధ్యక్షుడు ఇడగొటి ఎల్లయ్య 7వ వర్ధంతి స్థానికంగా మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి కార్పొరేటర్‌, పలువురు రాజకీయ నాయకులు హాజరై ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్‌ మాట్లాడుతూ.. ఆర్థికంగా వెనుకబడిన వడ్డెర కులస్తులకు కూడు గూడు కల్పించిన ఘనత ఎల్లయ్యదని తెలిపారు. ఆయన హయాంలో వడ్డెర కులస్తులకు ఎన్నో సేవా కార్యక్రమాలు చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో బస్సు అధ్యక్షుడు నాగేష్‌, పార్వతి, చిన్న తదితరులు పాల్గొన్నారు.

చెత్త తొలగింపు

రంగారెడ్డినగర్‌: గాంధీనగర్‌ పారిశ్రామికవాడ పరిధిలో పేరుకుపోతున్న చెత్త వ్యర్థాల విషయమై మంగళవారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి ఐలా అధికారులు స్పందించారు. పారిశ్రామికవాడను ఆనుకుని ఉన్న గాంధీనగర్‌, సంజయ్‌గాంధీనగర్‌, ఐడీపీఎల్‌- జగద్గిరిగుట్ట రోడ్లలో గతకొన్ని రోజులుగా చెత్తను తరలించకపోవడంతో స్థానికంగా తీవ్ర దుర్గంధం నెలకొంటోంది. ఈ విషయమై సాక్షిలో ‘చెత్త తరలింపుపై .. పట్టింపేది’ శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన అధికారులు మంగళవారం ఉదయమే సిబ్బందితో చెత్తను తరలించారు.



ఏవీ మోడల్‌ స్కూల్‌ సీజ్‌

చింతల్‌: అనుమతులు లేని పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించి వారి భవిష్యత్‌ను నాశనం చేయవద్దని కుత్బుల్లాపూర్‌ ఎంఈఓ జెమినీ కుమారి అన్నారు. సూరారంలోని పాండు బస్తీలో ఉన్న ఏవీ మోడల్‌ స్కూల్‌ను మంగళవారం సీజ్‌ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. స్కూల్‌ యాజమాన్యం అనుమతులు ఒకచోట తీసుకొని ఎటువంటి అనుమతులు లేకుండా మరోచోటకి భవనం మార్చినట్లు తెలిపారు. పాఠశాల రిజిస్ట్రేషన్‌ విషయమై నిబంధనలు పాటించకపోవడంతో పాఠశాలను సీజ్‌ చేసినట్లు పేర్కొన్నారు. .

మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌ను సన్మానించిన నేతలు

సుభాష్‌నగర్‌: నూతన మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన ధర్మపురి శాసనసభ్యుడు అడ్లూరి లక్ష్మణ్‌ను మంగళవారం కుత్బుల్లాపూర్‌ కాంగ్రెస్‌ ఏ-బ్లాక్‌ అధ్యక్షుడు బండి శ్రీనివాస్‌గౌడ్‌ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. సాధారణ కార్యకర్త నుంచి కేబినెట్‌ మంత్రిగా ఎదగడం గర్వించదగ్గ విషయం అన్నారు. కార్యక్రమంలో పులి సందీప్‌గౌడ్‌, బండి అవినాష్‌ గౌడ్‌, పూర్ణచందర్‌ పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించకుంటే కనెక్షన్‌ కట్‌

రంగారెడ్డినగర్‌: ఏళ్ల తరబడి నీటి బిల్లులు చెల్లించకుండా ఉన్న వినియోగదారులపై జలమండలి అధికారులు దూకుడు ప్రదర్శిస్తున్నారు. ఆదర్శ నగర్‌ సెక్షన్‌ పరిధిలోని నెహ్రూనగర్‌లో మంగళవారం జీఎం మాధవి ఆదేశాలతో డీజీఎం వికాస్‌ మేనేజర్‌ పూజిత రెవెన్యూ సిబ్బందితో కలిసి బిల్లులు చెల్లించని ఇళ్లపై దాడులు నిర్వహించారు. అధికారులు ఇప్పటికే పలు పర్యాయాలు నోటీసులు జారీ చేశారు. అయినప్పటికీ వినియోగదారులు నీటి బిల్లులు మాత్రం చెల్లించడం లేదు. దీంతో మంగళవారం డీజీఎం వికాస్‌, మేనేజర్‌ పూజిత తమ సిబ్బందితో తనిఖీలు నిర్వహించి చెల్లించని ఇళ్ల కనెక్షన్లను తొలగించారు.